క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో చేరిక



విద్యార్థి తండ్రికి అడ్మిషన్ అందజేస్తున్న హెచ్ఎం సుధాకర్

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తమ పిల్లలను శనివారం చేర్పించారు. మన్నసముద్రం గ్రామానికి చెందిన మురళి బుచ్చినాయుడుకండ్రిగ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎంతో అనుభవం, అంకితభావంతో బోధన చేసే ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారని నమ్మి తమ పిల్లలను పాఠశాలలో చేర్పినట్లు ఉపాధ్యాయుడు చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ విద్యార్థుల అడ్మిషన్‌ను వారి తండ్రికి అందించారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక



కీర్తన

సత్యవేడు: మండలంలోని మాదనపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదవుతున్న విద్యార్థిని బి.కీర్తన జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. ఈసందర్భంగా టీచర్లు, సహచర విద్యార్థులు కీర్తనను అభినందించారు.

తెరుచుకోని హాస్టళ్లు



మూతపడి ఉన్న బీసీ హాస్టల్

బుచ్చినాయుడుకండ్రిగ: ఈనెల 13 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనా బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ, ఎస్సీ హాస్టళ్ల శనివారం ఉదయం 8 గంటల వరకు మూతపడి తెరచుకోలేదు. దీంతో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై మూడు రోజులు కావస్తున్నా హాస్టల్స్ మూతపడి ఉన్నాయి. హాస్టళ్ల వార్డన్లు స్థానికంగా కాపురం లేకపోవడం, ఎప్పుడు వస్తారో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉందంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హాస్టళ్ల తెరచుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గంగ జాతర అనుమతికి వినతి



ఈఓ ఎస్వీ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న జాతర నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో వెలసిన గంగమ్మకు 18, 19వ తేదీల్లో జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో శనివారం పానగల్ గంగమ్మ జాతర కమిటీ నిర్వాహకులు శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పురపాలకసంఘ అధికారులకు జాతర నిర్వహణ కోసం వినతిపత్రం అందజేశారు. జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా చేస్తామన్నారు.

అంగన్‌వాడీల్లో చేర్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రేణిగుంట: పిల్లలను అంగన్‌వాడీ స్కూళ్లలో చేర్పించి చదువుతో పాటు సమతుల పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందించాలని ఐసీడీఎస్ తసూపర్‌వైజర్ హేమావతి కోరారు. మండలంలోని కె.గొల్లపల్లి, ఇందిరాగనర్, కరకంబాడిలలో శనివారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ స్కూళ్లలో పిల్లలకు అందించే పౌష్టికాహారంతో పాటు పిల్లల నాణ్యమైన ఉచిత విద్య అంగన్‌వాడీ స్కూళ్లలో అందిస్తున్నట్లు వివరించారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలనపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ ఎస్ఈగా సురేంద్రనాయుడు

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎఫ్ఏసీ)గా పి.సురేంద్ర నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్స్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్ఈగా ఉన్న కృష్ణారెడ్డి సెలవులో వెళ్లారు. చంద్రగిరికి చెందిన సురేంద్రనాయుడు సీఎం చంద్రబాబుకు సన్నిహితుడనే పేరుంది. ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సురేంద్రనాయుడు ఎస్ఈగా నియమితులు కావడం గమనార్హం.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- భూసారం పెంపునకు ఉపయోగం
- ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం
- 25 నుంచి 35 రోజుల్లో కోత దశకు



ముడియూరులో జనుము పంట



సిద్ధిరాజుకండ్రిగలో జీలగ పంట

పిచ్చాటూరు: భూమి కోల్పోయిన పోషకాలను సహజ పద్ధతిలోనే పునరుద్ధరించేందుకు ఉత్తమమైన మార్గం పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర సాగు చేసి భూములను సారవంతంగా మార్చుకోవచ్చు. పూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైర్లను పొలంలో కలియదున్నడం వల్ల అవి కుళ్లి నత్రజని పోషకాలు ఎక్కువ పరిమాణాల్లో నేలకు అందుతాయి. పశువుల పేడ కంటే పచ్చిరొట్ట పైర్లు పదిరెట్లు అధికంగా నేలను సారవంతం చేస్తాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. తద్వారా కృత్రిమంగా నత్రజని, భాస్వరం వాడకం కూడా తగ్గించుకొని, నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చు. ఆశించిన మేర ఫలితాలు ఇస్తుండడంతో గ్రామల్లో రైతులు ప్రధాన పంటల కంటే ముందు పచ్చిరొట్ట పంటల సాగువైపు మొగ్గుచూపుతున్నారు.

ఉపయోగాలివి..

పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూమి నీటిని, పోషకాలను నిలుపుకొనే సామర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పంట కుళ్లిన తరువాత విడుదల చేసే భాస్వరం, పొటాష్‌లతోపాటు గాలిలో నత్రజనిని నేలలో స్థిరీకరిస్తాయి. దీంతో నేలసారం పెరుగుతుంది. సూక్ష్మపోషకాలు మొక్కలకు అందుతాయి. సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి మొక్కల వేర్లు అభివృద్ధి చెందుతాయి.

వినియోగం ఇలా..

పచ్చిరొట్ట ఎరువులను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఆ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పేట్ వేస్తే పచ్చిరొట్ట త్వరగా కుళ్లుతుంది. మగ్గిన తర్వాతే పంటలు వేసుకోవాలి. పచ్చిరొట్ట సాగుచేసే పొలాల్లో నత్రజని ఎక్కువగా ఉంటే ఎకరాకు 8 కిలోల నత్రజని వాడడం వలన మొక్కలు పెరిగి రొట్ట అధికంగా వస్తుంది.


పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది..



పచ్చిరొట్ట పంటల సాగుతో వ్యవసాయ భూమి సారవంతంగా తయారవుతుంది. భూసారం పెరగడానికి ప్రధాన పంటకు ముందుగా రైతులు విధిగా పచ్చిరొట్ట సాగుచేయాలి. పచ్చిరొట్ట ఎరువుతో దిగిబడి పెరగడంతో పాటు గింజ గట్టిగా ఉంటుంది. ప్రతికూల పరిస్థితులను పైరు తట్టుకొని నిలబడుతుంది. ఆరోగ్యకర ఉత్పత్తులను సాధించవచ్చు. ప్రస్తుతం 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తోంది.

–సంజీవరెడ్డి, ఏఓ, పిచ్చాటూరు

రుచికరమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వాతి

సత్యవేడు: పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని బెరాక ఫౌండేషన్ చైర్మన్ కే. ఏసుదాసు తెలిపారు. శనివారం సర్పంచ్ శిరీష, శ్రీనివాసులురెడ్డి సహకారంతో పంచాయతీలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 116 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు స్వాతీ, నవీన్ కంటిపరీక్షలు నిర్వహించారు. 16 మందికి కంటి అద్దాలు ఉచితంగా ఇస్తామన్నారు. ఆరుగురికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామన్నారు. బెరాక ప్రార్థనా మందిరం నిర్వాహకులు, సుధ, ఏసుదాసు, ప్రవీణ్, లక్ష్మయ్య ఆశాష్‌బాబు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా అలుగు ఉత్సవం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అలుగు ఉత్సవం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పోతురాజుతో పాటు అలుగును యువకులు పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఊరేగింపు సమయంలో యువకులు వీరతాడులతో ఒకరినొకరు కొట్టుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో కుండపై ఏ ఆధారం లేకుండా కత్తిని నిలిపే కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ శ్రీకృష్ణరాయభారం భాగవతం ఆలపించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, గురవారెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రాగసుధ గానామృతం



తిరుపతి కల్చరల్: హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో ఏర్పాటు చేసిన పి.రాగసుధ గాత్ర కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. అన్నమాచార్య సంకీర్తనలను సుమధురంగా గానం చేసి సభికులను మైమరిపించారు. వీరికి వయోలిన్‌పై వెంకటరమణ, మృదంగంపై పన్నూరు స్వామి, చక్కటి వాయిద్య సహకారం అందించారు.

వేసవి దుక్కులతో మేలు

- సస్యరక్షణ చర్యలతో క్రిమికీటకాల నివారణ
- భూసార పరీక్షలు తప్పనిసరి
- సాగులో మెలకువలు పాటిస్తున్న అన్నదాతలు




వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు

వరదయ్యపాళెం: పంట కోతల తర్వాత మళ్లీ వర్షాలు కురిసేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

వేసవిలో పొలాల్లో పంటలు సాగులో ఉండవు. చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమిని ఆశ్రయిస్తాయి. వరి, అపరాలు వంటి పంటలకు ఆశించే తెగుళ్లు, పచ్చపురుగు, లద్దె పురుగు వంటివి భూమిలో ఉంటాయి. వేసవిలో లోతుగా దుక్కులు వేయడం వల్ల నేలలో ఉన్న చీడపురుగుల కోశాలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు వంటి పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతుగా దుక్కులను చేయడంతో పురుగుమందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తర్వాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కులవల్ల ఇతర గడ్డి జాతి మొక్క విత్తనాలు వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులు చేపట్టడానికి మే నెలలో అనువైన సమయం, ఇప్పుడు దుక్కులు చేపట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. భూమిలో అడుగుభాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే పెరిగిన పంటలను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవిలో పొలాల్లో ఒకటిన్నర అడుగులోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు చేపట్టాలి. దీనివల్ల భూమి లోపల ఉన్న శిలీంధ్ర సిద్ధ బీజాలతో పాటు, గడ్డి మూలాలు కూడా బయటపడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయి. వేసవి దుక్కులు చేపట్టడం వల్ల భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది. దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.

భూసారం పెరుగుతుంది..



వేసవి దుక్కులు వల్ల భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి కీటకాలు నశిస్తాయి. దీనివల్ల పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటల కోత తర్వాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. ప్రతిరైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం ఆర్బీకేల్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి. భూసార పరీక్షలు వల్ల ఎరువుల వాడకం తగిన రీతిలో పంటలకు వేసుకోవచ్చు.– **సుహర్‌లత, ఏఓ, వరదయ్యపాళెం మండలం**

విద్యార్థులకు విద్యాకానుక పంపిణీ



విద్యాకానుక అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విద్యార్థులకు విద్యాకానుకను పంపిణీ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతకు ముందు ఆయన మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం తదితర వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. విద్యార్థులతో ఆయన ఉల్లాసంగా గడిపారు. ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



నెలవాయిలో కిట్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం జగనన్న విద్య కానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టూడెంట్ విద్య కానుక పథకంలో ప్రతి విద్యార్థికి మూడు జతల బట్టలు, ఒక జత షూ, బెల్టు, బ్యాగు, డిక్షనరీ, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నారని తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ ధనంజయులు, సర్పంచ్ సుధాకర్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభ్యుదయ సాహిత్యానికి ఆద్యులు శ్రీశ్రీ





బుచ్చినాయుడుకండ్రిగ: శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, ఏర్పేడు జూనియర్ కాలేజీలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ఆధునిక తెలుగు సాహిత్యంలో యుగకర్తగా పేరు పొందిన శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని కల్లివెటు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రూపేష్‌కుమార్ శ్రీశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి మాట్లాడుతూ ఈ శతాబ్దం నాదంటూ ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు అని అన్నారు. అభ్యుదయ సాహిత్యానికి ఆద్యులుగా పాలకులు, పీడితులపై తన అక్షరాలతో కలాన్ని, గళాన్ని వినిపించారన్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానం ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక సంచలమని కొనియాడారు. ఉపాధ్యాయులు నాదెండ్ల మురళి, ప్రసాద్, దేవేంద్ర, మాధవీలత, దాసు, జగన్నాథం, మురళిప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునిక సమాజానికి శ్రీశ్రీ ఆదర్శం

ఏర్పేడు: శ్రీశ్రీ ప్రతి కవిత ఆధునిక సమాజానికి దర్పణం లాంటిదని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ అమరేశ్వర రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు అధ్యాపకులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీమన్నారాయణ, రాఘవరెడ్డి, వెంకటసురేష్, సువర్ణ, శంకరప్ప, సమీర్, నారాయణబాబు, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. రేణుక పరమేశ్వరి గ్రామోత్సవం



విశేష అలంకరణలో రేణుక పరమేశ్వరిదేవి గ్రామోత్సవం



మాతమ్మ అమ్మవారి ముగ్గు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో జరుగుతున్న మాతమ్మ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రేణుక పరమేశ్వరిదేవి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అదేరోజు ఉదయం ఆలయంలో మాతమ్మ అమ్మవారి బొమ్మను వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు, డప్పులు, వాయిద్యాలు, బాణసంచా మెరుపులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

విద్యతోనే విద్యార్థులకు విజ్ఞానం



ఆన్‌లైన్ తరగతి గదిని ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసన్న, ఎమ్మెల్యే వెంకటసుధీర్‌రెడ్డి

ఏర్పేడు: విద్యతో విజ్ఞానాన్ని పొందవచ్చని సినీనటి మంచు లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం మండలంలోని తమ స్వగ్రామమైన మోదుగులపాలెం ప్రాథమిక పాఠశాలలో టీచ్ ఫర్ ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డితో పాటు ఆన్‌లైన్ తరగతి గదిని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 12 జిల్లాల్లో టీచ్ ఫర్ ఛేంజ్ కార్యక్రమం చేసినట్లు వివరించారు. విద్యతో ఆర్థిక అక్షరాస్యతను సాధించవచ్చన్నారు. పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధనుంజయుల నాయుడు, నాగరాజునాయుడు, ఎంఈఓ ప్రేమలత పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్లబ్ అండర్ -17 విజేత తిరుపతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడామైదానంలో శుక్రవారం నిర్వహించిన అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో రేణిగుంట, మూడో స్థానంలో సూళ్లూరుపేట జట్లు నిలిచాయి. నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కామిరెడ్డి రాజారెడ్డి ఆర్థిక సౌజన్యంతో టోర్నమెంట్ నిర్వహించారు. 10 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ సమన్వయకర్తగా గౌష్‌బాషా వ్యవహరించారు. తిరుపతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, జాయింట్ కన్వీనర్ రమేష్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మ్యాచ్ రిఫరీలుగా నారాయణ హైస్కూల్ పీఈటీ మధు, ప్రిన్స్, నాని వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాజారెడ్డి క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. ఆరోగ్యకరమైన మనుషులు తయారైతేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ యువకులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రముఖ న్యాయవాది చదలవాడ కుమార్ మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలో ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందనీయులన్నారు.